# ప్రజాపక్షం

## జిల్లా అనుబంధం

హన్మకొండ, వరంగల్, జనగాం, మహబూబాబాద్, భూపాలపల్లి, ములుగు

మెదక్, సంగారెడ్డి, సిద్దిపేట

ఆదివారం | 24 మే, 2026 | పేజీలు : 06


## దేవరుప్పుల పోలీస్ స్టేషన్‌ను తనిఖీ

### ఐపిఎస్ మనీషా నెహ్రా




**ప్రజాపక్షం/దేవరుప్పుల:** ఐపీఎస్ అధికారిని మనీషా నెహ్రా శుక్రవారం దేవరుప్పుల పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పోలీస్ కిట్, స్టేషన్ ప్రాంగణం, క్రైమ్ వాహనాలు, కేసు ప్రాపర్టీ, కోర్టుగది, వర్క్ స్టేషన్, స్టేషన్ రికార్డులను పరిశీలించారు. అనంతరం సిబ్బందితో మాట్లాడి పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో పాలకుర్తి సీఐ జానకీరామ్ రెడ్డి, దేవరుప్పుల ఎస్ఐ సృజన్ కుమార్, పోలీసులు పాల్గొన్నారు.

# త్రివేణి సంగమ తీరాన భక్తజన సందోహం



### పుష్కర స్నానం.. పుణ్యఫలం
### కాళేశ్వరంలో ఆధ్యాత్మిక సందడి
### సరస్వతి పుష్కరాలకు పోటెత్తిన భక్తజనం
### 3వ రోజుకు చేరుకున్న సరస్వతీ అంత్య పుష్కరాలు

**ప్రజాపక్షం/భూపాలపల్లి/కాళేశ్వరం:** కాళేశ్వరం క్షేత్రంలో కొనసాగుతున్న సరస్వతీ అంత్య పుష్కరాలలో భాగంగా మూడో రోజు శనివారం త్రివేణి సంగమ తీరంలో క్రమంగా భక్తుల రద్దీ పెరిగి సందడిగా మారింది. గత రెండు రోజులుగా మందకొడిగా కొనసాగిన భక్తుల రాక శనివారం మండుటెండలను సైతం లెక్కచేయకుండా తమ కుటుంబాలతో భక్తులు భారీ సంఖ్యలో తరలి వచ్చి పుష్కర పుణ్యస్నానాలు ఆచరించారు. ఆర్టీసీ బస్సుల్లో క్షేత్రానికి చేరుకున్న భక్తుల సౌకర్యార్థం ప్రయాణ ప్రాంగణం నుండి పుష్కర ఘాట్ తీరం వరకు ఉచిత షటిల్ మనీ సర్వీసులు ఏర్పాటు చేయడంతో భక్తులు సులభంగా ఘాట్లకు చేరుకున్నారు.త్రివేణి సంగమంలో పుణ్యస్నానాలు ఆచరించిన అనంతరం భక్తులు క్షేత్రం లోని ప్రధాన ఆలయాన్ని సందర్శించి శ్రీ కాళేశ్వర ముక్తేశ్వర స్వామివారిని, శుభానంద దేవి, సరస్వతి మాతలను దర్శించుకున్నారు.ఆలయం క్యూలైన్ల వెంట భక్తుల దాహార్తిని తీర్చేందుకు దేవస్థానం ఆధ్వర్యంలో తాగునీరు,మజ్జిగ పంపిణీ చేసారు.ఆలయంలో ప్రతిరోజూ నిర్వహిస్తున్న స్వామివారి కల్యాణం,ప్రత్యేక హోమాలలో భక్తులు ఉత్సాహంగా పాల్గొంటున్నారు. సరస్వతి ఘాట్ వద్ద సాయంత్రం నిర్వహించే సరస్వతి నవ రత్న మాలా హారతి ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తుండగా హారతి అనంతరం సాంస్కృతిక కళా ప్రదర్శనలు, పండితుల ప్రవచనాలు భక్తులను ఆకట్టుకుంటున్నాయి. సరస్వతీ పుష్కరాల సందర్భంగా వివిధ ప్రాంతాలకు చెందిన మఠాధిపతులు హాజరై ప్రవచనాలు అందించడంతో భక్తుల రాక మరింతగా పెరుగుతోంది.ఎండల తీవ్రతను దృష్టిలో ఉంచుకుని పుష్కర ఘాట్ వద్ద మంచినీటి సరఫరా,చలువ పందిళ్లు, మిస్ట్ ఫాగ్ స్ప్రింక్లర్లు ద్వారా నీటి జల్లులు పడేలా ప్రత్యేక ఏర్పాట్లు చేయడం ద్వారా భక్తులు సేదతీరుతున్నారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని శాఖల సమన్వయంతో అధికార యంత్రాంగం విస్తృత ఏర్పాట్లు చేసి పుష్కరాలను విజయవంతంగా నిర్వహిస్తోంది. త్రివేణి సంగమ తీరంలో భక్తజనం పుష్కర స్నానాలతో పులకించి పోతుండగా, కాళేశ్వర ముక్తీశ్వర స్వామి దర్శనాలతో భక్తి పారవశ్యంలో మునిగితేలడంతో కాళేశ్వరం క్షేత్రం ఆధ్యాత్మిక శోభను సంతరించుకుని సరస్వతీ అంత్య పుష్కరాలు భక్తులకు స్వాగతం పలుకుతున్నాయి.





# ముందస్తు వర్షాలపై రైతుల ఆశలు



### 25 నుండే రోహిణి కార్తె
### విత్తనాల కొనుగోళ్లు, దుక్కుల చదును

**ప్రజాపక్షం/జనగామ :** వేసవి ఎండలు మండుతున్నప్పటికి వానాకాలం మాత్రం మొదలవుతుంది. ఈ నెల 25న రోహిణి కార్తె ప్రారంభం కావడంతోనే వర్షాకాలం మొదలు కానుంది. రోహిణి కార్తెతోనే రైతులు విత్తనాలు, విత్తడం, వరి నార్లు పోయడం వంటివి జరుగుతాయి. దీనికి ముందస్తుగానే దుక్కులు చదును చేయడం, విత్తనాలు ఏవేవి వేయాలో నిర్ణయించుకొని కొనుగోలు చేయడం వంటివి పూర్తి అవుతున్నాయి. ఇక అన్ని ప్రాంతాలతో చూస్తే జనగామకు ఒక ప్రత్యేకత ఉంది. ఇక్కడ మూడో పంట వేస్తారు. వానాకాలం, యాసంగి పంటతో పాటు కత్తెర పంటగా రోహిణి కార్తెలోనే నాట్లు వేస్తారు. వాతావరణంలో కూడా కొద్దిపాటి మార్పు రావడంతో రైతులు ముందస్తు వర్షాల కోసం ఎదురు చూస్తున్న పరిస్థితి.

**రోహిణి కార్తెతోనే పంటల సాగు మొదలు**

రోహిణి కార్తి ప్రారంభంతోనే రైతులు పంటల సాగుపై దృష్టి పెడతారు. రోహిణి కార్తిలో వేసిన విత్తనం బలంగా, అధికంగా దిగుబడి అవుతుందన్న నమ్మకం కూడా రైతుల్లో ఉంటుంది. అదే విధంగా రోహిణి కార్తిలోనే రోకళ్లు పగిలే విధంగా ఎండలు కాస్తాయన్న నానుడి కూడా ఉంది. అయినప్పటికి వర్షాలు కురిస్తే మాత్రం విత్తనాలు విత్తుతారు. ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా ఇదే పరిస్థితి కావడంతో రోహిణి కార్తిపైనే ఆశలు పెట్టుకునే రైతులు విత్తనాలు విత్తి బావులు, బోర్ల నీరు పెట్టడానికి సైతం సిద్ధం అయ్యే పరిస్థితి.

**దుక్కులు చదువు..విత్తనాలు సిద్ధం**

వర్షాకాలం ప్రారంభం అయి భారీ వర్షం కురవగానే రైతులు పత్తి, మొక్కజొన్న, వేరుశనగ విత్తనాలు వేస్తారు. అయితే ఇందు కోసం రైతులు విత్తనాలు సిద్ధంగా పెట్టుకున్నారు. జనగామ జిల్లాలో 2లక్షలకు పైగా పత్తి విత్తన ప్యాకెట్లు అవసరం ఉండగా 2.75లక్షల విత్తన ప్యాకెట్లు అందుబాటులో ఉన్నట్లు వ్యవసాయ శాఖ అధికారులు తెలిపారు. కురిసిన చోట దుక్కుల్ని చదువు చేశారు. పత్తి కట్టెను తొలగించి చదును చేశారు. వర్షం కురిస్తే చాలు విత్తనాలు విత్తడానికి సిద్ధంగా ఉన్నారు.

**భూమిలో వేడి చల్లారితోనే విత్తనం విత్తాలి**

గతంతో పోలిస్తే ఈ ఏడాది ఎండల తీవ్రత ఎక్కువగా ఉంది. భూమి వేడెక్కింది. విత్తనాలు విత్తాలంటే భూమి చల్లబడాలి. అంటే భారీ వర్షాలు కురవాలి. మొదటి వర్షానికే కాకుండా రెండు, మూడు వర్షాలు కురిసిన తరువాత విత్తనాలు విత్తాలని వ్యవసాయ శాఖ అధికారులు చెబుతున్నారు. గతంతో పోలిస్తే నాలుగు రోజులు ముందే రుతుపవణాలు తెలంగాణకు వచ్చే అవకాశాలు ఉన్నాయని వాతావరణ శాఖ చెబుతుంది. ఏదీ ఏమైనా ఈ నెల 25న రోహిణి కార్తె మొదలు కానుండడంతో రైతులు పొలం బాట పట్టే అవకాశాలు ఉన్నాయి.

# యువత అభివృద్ధే ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక లక్ష్యం

**ప్రజాపక్షం/హనుమకొండ :** యువత అభివృద్ధే ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక ప్రధాన లక్ష్యమని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి అన్నారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా హనుమకొండ యువజన, క్రీడల శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన యువజన, క్రీడల వారోత్సవాల్లో శనివారం “ఉద్యోగ సాధన కనెక్టింగ్ టాలెంట్ విత్ అపార్చునిటీస్” కార్యక్రమం నిర్వహించి వివిధ పోటీల్లో విజేతలైన యువతకు మెడల్స్ ప్రదానం చేశారు.హనుమకొండ జిల్లా యువజన, క్రీడా అభివృద్ధి అధికారి కొత్త ప్రశాంత్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమం ద్వారా ప్రభుత్వం ప్రజలకు మరింత చేరువవుతోందని పేర్కొన్నారు. యువత అభివృద్ధి, ఉపాధి అవకాశాల కల్పన, క్రీడలకు ప్రోత్సాహం వంటి అంశాలకు ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందన్నారు. యువత తమ ప్రతిభను వెలికితీసుకుని సమాజ అభివృద్ధిలో భాగస్వాములు కావాలని సూచించారు.క్రీడలు యువతలో నాయకత్వ లక్షణాలు, క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసాన్ని పెంపొందిస్తాయని ఎమ్మెల్యే తెలిపారు. యువజన, క్రీడల శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కార్యక్రమాలకు జిల్లాలో విశేష స్పందన లభిస్తోందన్నారు.కుడా చైర్మన్ ఇనుగాల వెంకటరామిరెడ్డి మాట్లాడుతూ యువతలో సామాజిక బాధ్యత పెంపొందించేందుకు ఇలాంటి కార్యక్రమాలు ఎంతో దోహదపడతాయని అన్నారు. క్రీడలు యువతను మంచి మార్గంలో నడిపించి సమాజానికి ఉపయోగపడే వ్యక్తులుగా తీర్చిదిద్దుతాయని పేర్కొన్నారు.ఉమ్మడి జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎండి అజీజ్ ఖాన్ మాట్లాడుతూ గ్రామీణ స్థాయి నుంచి క్రీడాకారులను ప్రోత్సహించాల్సిన అవసరం ఉందన్నారు. యువత క్రీడలను కెరీర్‌గా మలుచుకునేలా ప్రభుత్వం, క్రీడా సంఘాలు కలిసి పని చేస్తున్నాయని తెలిపారు.హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్ మాట్లాడుతూ యువత శారీరక, మానసిక దృఢత్వంతో ఎదగాలంటే క్రీడలు ఎంతో అవసరమని పేర్కొన్నారు. ఫిట్‌నెస్, క్రీడాస్ఫూర్తి సమాజ అభివృద్ధికి పునాదులని అన్నారు.ఈ సందర్భంగా వివిధ పోటీల్లో విజేతలైన యువతకు మెడల్స్ అందజేసి అభినందించారు. అలాగే ఇటీవల నిర్వహించిన జాబ్ మేళాలో ఉద్యోగాలు సాధించిన యువతకు నియామక పత్రాలు అందజేశారు.ఈ కార్యక్రమంలో తెలంగాణ తెలుగు అకాడమీ చైర్మన్ కూరపాటి వెంకట్ నారాయణ, ఇండస్ట్రియల్ జీఎం నవీన్ కుమార్, క్రీడాకారులు, కోచ్‌లు, యువజన సంఘాల ప్రతినిధులు, విద్యార్థులు, అధికారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



## పాలిసెట్ పరీక్షలో స్టేట్ ర్యాంకు సాధించిన విజ్ డమ్ హైస్కూల్ విద్యార్థి

**ప్రజాపక్షం/ నర్సంపేట :** పాలిసెట్ 2026 ప్రవేశ పరీక్షల్లో విజ్ డమ్ హై స్కూల్ కు చెందిన షేక్ ఫర్మాన్ షా రాష్ట్రస్థాయిలో 4వ ర్యాంకును సాధించినట్లు పాఠశాల డైరెక్టర్ జావేద్ తెలిపారు. ఈ విద్యార్థి 120 మార్కులకు గాను 119 మార్కులు సాధించడం జరిగింది. ఉత్తమ ప్రతిభను కనబరిచిన ఫర్మాన్ షా అభినందించారు. ఈసందర్భంగా జావేద్ మాట్లాడుతూ షేక్ అర్మాన్ షా స్టేట్ 48వ ర్యాంకు, గౌతమ్ స్టేట్ 350 వ ర్యాంకు సాధించగా, 2000 ర్యాంకు లోపు 12 మంది విద్యార్థులు సాధించారన్నారు. అనంతరం ఫర్మాన్‌షా మాట్లాడుతూ కంప్యూటర్ ఇంజనీరింగ్‌లో రాణించి భవిష్యత్తులో ఐఏఎస్ కావడం తన లక్ష్యమన్నారు. తన విజయానికి నిరంతరం కృషి చేసిన తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు, ప్రోత్సహించిన వారందరికీ కృతజ్ఞతలు తెలిపారు. ఈకార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ జహంగీర్, అకాడమిక్ అడ్వైజర్ నాజియ ఇక్బాల్, వైస్ ప్రిన్సిపాల్ ప్రకాష్, ప్రీ స్కూల్ ప్రిన్సిపాల్ ఫహీం సుల్తానా, హై స్కూల్ ఇన్చార్జి హారిక, వీరభద్రయ్య, రాము, ఇలియాస్, శివ రాజ్, సతీష్ కుమార్, రఘుపతి రెడ్డి, రవీందర్, వెంకటేశ్వర్లు, నవీన్, రవీందర్ లతో పాటు ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

## ఆసరా పెన్షన్లకు దరఖాస్తుల వెల్లువ...

**ప్రజాపక్షం/నెక్కొండః** తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఆసరా పెన్షన్ పథకం పేదలు, వృద్ధులు, వికలాంగులు, వితంతువులు, చేనేత కార్మికులు, బిడి కార్మికులకు పెద్ద భరోసాగా నిలుస్తోంది. తాజాగా కొత్తగా ఆసరా పెన్షన్ల కోసం దరఖాస్తులను స్వీకరిస్తుండదంతో గ్రామాలు, పట్టణాల్లో ప్రజలు పెద్దయెత్తున ముందుకు వస్తున్నారు. ప్రభుత్వం ప్రకటించిన అర్హతల ప్రకారం వృద్ధాప్య పెన్షన్, వికలాంగుల పెన్షన్, వితంతు పెన్షన్, చేనేత, కల్లుగీత కార్మికుల పెన్షన్, బిడి కార్మికుల పెన్షన్‌లకు సంబంధించి ఆధార్ కార్డు, ఓటర్ ఐడి, రేషన్ కార్డు, బ్యాంక్ పాస్‌బుక్ తదితర పత్రాలతో ప్రజలు దరఖాస్తులు సమర్పిస్తున్నారు. అయితే చాలా మంది అర్హులు గతంలో సాంకేతిక కారణాలు, ఆధార్ లింక్ సమస్యలు, ధృవీకరణ లోపాలు, సర్వేలో పేర్లు నమోదు కాకపోవడం వలన పథకానికి దూరమయ్యారని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈసారి నిజమైన అర్హులెవ్వరూ నష్టపోకుండా పారదర్శకంగా దరఖాస్తులను పరిశీలించి పెన్షన్లు మంజూరు చేయాలని ప్రజలు కోరుతున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో వృద్ధులు, వికలాంగులు కార్యాలయాల చుట్టు తిరగాల్సిన పరిస్థితి లేకుండా ప్రత్యేక శిభిరాలు ఏర్పాటు చేసి దరఖాస్తుల ప్రక్రియను సులభతరం చేయాలని స్థానికులు ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేస్తున్నారు. ఆసరా పెన్షన్ అనేది పేద కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించే జీవనాధార పథకమని, అర్హులందరికి న్యాయం జరిగేలా అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని ప్రజలు కోరుతున్నారు.

## యువజన నాయకునికి శుభాకాంక్షలు తెలిపిన ఎర్రబెల్లి

**ప్రజాపక్షం/దేవరుప్పుల:** మండలంలోని కామారెడ్డి గూడెం గ్రామానికి చెందిన గ్రామ బీఆర్ఎస్ పార్టీ యువజన నాయకులు కంచర్ల హరీష్ పుట్టిన రోజు సందర్భంగా మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు హాజరై ఆయనకు శాలువాకప్పి శుభాకాంక్షలు తెలియజేయడం జరిగింది. వారి వెంట బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలున్నారు.

## ప్రత్యామ్నాయ పంటల సాగు రైతుకు లాభాదాయకం

### ఆత్మ కమిటీ చైర్మన్ నల్లు సుధకర్ రెడ్డి
### పంట వ్యర్థల దహనంతో భూసారనికీ తీవ్ర నష్టం



**ప్రజాపక్షం/మరిపెడ:** పంట మర్పిడి, ప్రత్యమ్నాయా పంటల సాగుతో రైతు కు వ్యవసాయం లాభాసాటిగా మరుతుందనీ ఆత్మకమిటి చైర్మన్ నల్లు సుధకర్ రెడ్డి అన్నారు.శనివారం మరిపెడ మున్సిపాలిటి ఎస్సి కమ్యునిటీ హాల్ లో చైర్మన్ విసారపు ప్రగతి శ్రీపాల్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు అనే కార్యక్రమానికి ముఖ్య ఆథిదిగా అయన హాజరయై మట్లడుతూ రైతులు ఓకే పంట పలు మర్లు వరుసగా సాగు చేస్తే భూసారం దెబ్బ తీంటుందనీ,డిమండ్ తగ్గుతుందనీ నష్టలు వస్తాయని,రైతులు పంట మర్పిడి చేస్తే మంచిదని,యురియా వాడకం తగ్గించాలనీ,నానో యురియా వాడాలనీ,పంట వ్యర్థలను దహనం చేస్తే భూసారం దెబ్బతింటుందనీ,మిత్ర కీటకాలు చనిపోతయని రైతుకు నష్టం జరుగుతుందనీ,భూసార పరీక్షలు చేయించు కోవలనీ కోరారు.ఈ సందర్భంగా కెవికె మల్యల శాస్త్రవేత్తలు ప్రశాంత్,సుహాసిని లు రైతులకు సాగులో మెలుకువలు వివరించారు. ఈ కార్యక్రమంలో ఎఓ వీరా సింగ్,అరవింద్, రైతులు, తదితరులు పాల్గోన్నారు.

## పాలీసెట్ ఫలితాల్లో గోల్డెన్ ఓక్ స్కూల్ విద్యార్థి అద్భుత ప్రతిభ

### స్కూల్ చైర్మన్ గంట రవికుమార్ హర్షం.



**ప్రజాపక్షం/వరంగల్ టౌన్ :** శనివారం విడుదలైన తెలంగాణ పాలీసెట్ ఫలితాల్లో శివనగర్‌లోని గోల్డెన్ ఓక్ స్కూల్ విద్యార్థి నామాల లోకేష్ అసాధారణ ప్రతిభ కనబరిచారు. కఠినమైన పోటీతో కూడిన ఈ పరీక్షలో సదరు విద్యార్థి ఎంపిసి రాష్ట్రస్థాయిలో 1వ ర్యాంక్ ఎంబైపీసీలో రాష్ట్రస్థాయిలో 6వ ర్యాంక్ సాధించి సరికొత్త రికార్డు సృష్టించారు.పాఠశాలలో అందించిన నాణ్యమైన విద్యాబోధన, ప్రత్యేక ప్రణాళికలు, ఉపాధ్యాయుల నిరంతర పర్యవేక్షణ వల్లే ఈ ర్యాంక్ సాధ్యమైందని విద్యార్థి తల్లిదండ్రులు కృతజ్ఞతలు తెలిపారు. భవిష్యత్తులో ఈ విద్యార్థి మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని పాఠశాల మేనేజ్ మెంట్, ఉపాధ్యాయ బృందం ఆకాంక్షించారు.విద్యార్థి సాధించిన ఈ ఘన విజయం పట్ల పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయులు మరియు స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ సందర్భంగా పాఠశాల చైర్మన్ గంట రవికుమార్ మాట్లాడుతూ.. విద్యార్థి మొదటి నుండి చదువులో ఎంతో ప్రతిభావంతుడని, క్రమశిక్షణ, కష్టపడే తత్వమే ఈ రోజు రాష్ట్రస్థాయిలో ఇంతటి ఉత్తమ ర్యాంక్ రావడానికి కారణమని కొనియాడారు. అహర్నిశలు శ్రమించి ఈ విజయాన్ని అందుకున్న విద్యార్థిని, అందుకు సహకరించిన వారి తల్లిదండ్రులను ఆయన ప్రత్యేకంగా అభినందించారు.

## ఉర్సు చెరువు బండ్ సుందరీకరణ పనులను వేగవంతంగా పూర్తి చేయాలి

### అభివృద్ధి పనుల పురోగతిని పరిశీలించిన కలెక్టర్లు



**ప్రజాపక్షం/ఖిలా వరంగల్ః** హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహాత్ బాజ్‌పాయి, వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద శనివారం పబ్లిక్ హెల్త్ శాఖ ఆధ్వర్యంలో కొనసాగుతున్న ఉర్సు గుట్ట, రంగసముద్రం చెరువు బండ్ సుందరీకరణ, అభివృద్ధి పనుల పురోగతిని ప్రత్యక్షంగా పరిశీలించారు. ఈ సందర్భంగా పనుల నాణ్యత, పురోగతిపై అధికారులతో సమీక్ష నిర్వహించిన కలెక్టర్లు, అభివృద్ధి పనులను మరింత వేగవంతం చేసి నిర్ధేశిత గడువులోగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రజలకు ఉపయోగపడే విధంగా పనులు ప్రమాణాలతో చేపట్టాలని సూచించారు. అదేవిధంగా చెరువు బండ్ పరిసరాలను ఆకర్షణీయంగా తీర్చిదిద్దడంతో పాటు ప్రజలకు మెరుగైన వాతావరణం కల్పించే దిశగా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో బల్దియా ఇంజనీర్ సంతోష్ బాబు, సిటీ ప్లానర్ రవీంద్ర రాడేకర్, తహసీల్దారు ఇక్బాల్, సంబంధిత శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్ర వ్యాప్తంగా రైస్ మిల్లర్ల సమస్యలను పరిష్కరించాలి

### రాష్ట్ర మిల్లర్ అసోసియేషన్ సంఘం అధ్యక్షుడు గణపతి రెడ్డి డిమాండ్

**ప్రజాపక్షం/హనుమకొండ టౌన్ :** తెలంగాణ రాష్ట్రంలో వరి కొనుగోలు ప్రక్రియ కొనసాగుతున్నప్పటికీ, రైస్ మిల్లర్లు అనేక సమస్యలతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు అని రైస్ మిల్లర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు పాడి గణపతి రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా శనివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడుతూ..ప్రభుత్వ విధానాలు,బకాయిల చెల్లింపుల ఆలస్యం అవ్వడం తో పాటు.. నిల్వ సమస్యలు, రవాణా ఖర్చుల పెరుగుదల కారణంగా మిల్లర్లు ఆందోళన వ్యక్తం చేస్తున్నారని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఈ రబీ సీజన్‌లో రికార్డు స్థాయిలో 90 లక్షల మెట్రిక్ టన్నుల వరి కొనుగోలు లక్ష్యాన్ని పెట్టుకుంది. ఇందుకోసం వేల సంఖ్యలో కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసింది.ఇక రైతుల నుంచి వరి కొనుగోలు వేగం పెరగడంతో, మిల్లింగ్ సామర్థ్యంపై కూడా ఒత్తిడి పెరిగిందన్నారు. మరోవైపు, వరి కొనుగోలు ఆలస్యం జరిగితే రైతులతో పాటు మిల్లర్లపై కూడా ప్రభావం పడుతుందని మిల్లర్ల సమస్యలను కూడా దృష్టిలో పెట్టుకొని సీఎం రేవంత్ రెడ్డి తో పాటు, మంత్రి ఉత్తంకుమార్ రెడ్డి, కేబినెట్ మంత్రులు అంతా మిల్లర్ల సమస్యలు పరిష్కరించే దశగా కేవినేట్లో నిర్ణయాలు తీసుకోవాలని గణపతి రెడ్డి డిమాండ్ చేశారు. ప్రభుత్వం పెండింగ్ బిల్లులు విడుదల చేయాలని,నిల్వ సదుపాయాలు పెంచడంతో పాటు..మిల్లర్లకు సబ్సిడీలు అందించాలన్నారు.
రాష్ట్రవ్యాప్తంగా ఉన్న మిల్లర్ల సమస్యలను త్వరగా పరిష్కరించలన్నారు

## టిజిఆర్‌జెసి ప్రవేశ పరీక్షలో నెక్కొండ విద్యార్థికి రాష్ట్ర స్థాయి ర్యాంక్




**ప్రజాపక్షం/నెక్కొండ:** నెక్కొండ మండల కేంద్రంలోని విద్యోదయ గురుకుల పాఠశాల విద్యార్థి దారం ప్రణవ్ కుమార్ ప్రతిభ కనబరిచాడు. ఇటీవల విడుదలైన పదవ తరగతి పరీక్ష ఫలితాల్లో 573 మార్కులు సాధించిన ప్రణవ్ కుమార్, రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన టిజిఆర్‌జెసి ప్రవేశ పరీక్షలో 60వేల మంది విద్యార్థుల మధ్య రాష్ట్ర స్థాయిలో 31వ ర్యాంక్ సాధించిన పాఠశాలకు గర్వకారణంగా నిలిచాడు. ఈ సందర్భంగా పాఠశాల యాజమాన్యం చల్ల నాగార్జున రెడ్డి, డైరెక్టర్ పారిజాతం కలిసి ప్రణవ్ కుమార్‌కు షీల్డ్ అందించి అభినందించారు. క్రమశిక్షణ, పట్టుదలతో చదివితే ఉన్నత ఫలితాలు సాధించవచ్చని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ షరీఫ్, ఉపాధ్యాయులు రంజిత్, యాకూబ్, తదితరులు పాల్గొన్నారు.

## అంగన్‌వాడీల్లో భారీగా ఉద్యోగాల భర్తీ

**ప్రజాపక్షం/నెక్కొండ:** రాష్ట్రంలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో భారీ స్థాయిలో ఉద్యోగాలను భర్తీ చేయాలని తెలంగాణ ప్రభుత్వం నిర్ణయించినట్లు సమాచారం. మహిళలకు ఉపాధి అవకాశాలు పెంచే లక్ష్యంతో మొత్తం 15,982 పోస్టులను భర్తీ చేసేందుకు చర్యలు చేపడుతున్నట్లు తెలిసింది. ఇందులో 12,882 హెల్పర్ పోస్టులు, 3100 టీచర్, వర్కర్ పోస్టులు ఉండనున్నాయి. ఈ ఉద్యోగాలకు మహిళలకు మాత్రమే అవకాశం కల్పించనున్నట్లు అధికారులు పేర్కొంటున్నారు. త్వరలో జిల్లా వారీగా అధికారిక నోటిఫికేషన్లు విడుదలయ్యే అవకాశం ఉంది. ఇక అంగన్‌వాడీ కేంద్రాల అభివృద్ధి పైనా ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తోందది. చిన్నారులకు మెరుగైన సౌకర్యాలు అందించే ఉద్దేశ్యంతో కేంద్రాల్లో ఆర్ఓ ప్లాంట్లు, తాగునీటి సదుపాయం, విద్యుత్ వసతి, శాశ్వత భవనాల ఏర్పాటు వంటి పనులు చేపట్టనున్నట్లు సమాచారం. ఈ నిర్ణయం ద్వారా గ్రామీణ ప్రాంతాల మహిళలకు ఉపాధి అవకాశాలు పెరగడంతో అంగన్‌వాడీ సేవలు బలోపేతం కానున్నాయని భావిస్తున్నారు.

## మృతుడి కుటుంబానికి ఆర్థిక సహాయం

**ప్రజాపక్షం/నర్సంపేట:** నర్సంపేట పట్టణంలోని 28వ వార్డుకు చెందిన సంగెపు రాజేంద్రప్రసాద్ ఇటీవల మృతిచెందారు. ఆయన కుటుంబానికి బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శి డాక్టర్ గోగుల రాణా ప్రతాప్ రెడ్డి సూచన మేరకు స్థానిక వార్డు కౌన్సిలర్ జూలూరి రోజారాణి రూ. 10వేల ఆర్థిక సహాయం అందించారు. ఈసందర్భంగా కౌన్సిలర్ మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ఆపదలో ఉన్న ప్రతి కుటుంబానికి అండగా ఉంటామని అని ఇచ్చిన మాటను బిజెపి పార్టీ నిలబెట్టుకుందని, దీనిలోభాగంగానే సంగెపు రాజేంద్రప్రసాద్ కుటుంబానికి రూ.10వేల ఆర్థిక సహాయం అందించామన్నారు. ఇది కేవలం సహాయం కాదు... ఆపదలో ఉన్న కుటుంబానికి భరోసా అన్నారు. ఈ కార్యక్రమంలో వార్డ్ సభ్యులు తాబేటీ క్రాంతికుమార్, సంగెపు శ్రీను, మొగిలిచర్ల సందీప్, బిజెపి నియోజకవర్గ నాయకులు జూలూరి మనీష్ గౌడ్, బిజెవైఎం కార్యదర్శి చిలువేరు అన్వేష్, వార్డ్ యువకులు సంగెపు తేజ, సాయి తరుణ్ కుటుంబ సభ్యులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

## పంట అవశేషాలను కాల్చొద్దు

### నెక్కొండ ఎస్ఐ మహేందర్ హెచ్చరిక

**ప్రజాపక్షం/నెక్కొండ:** వ్యవసాయ పొలాల్లో పంట అవశేషాలను కాల్చడం వలన పర్యావరణానికి తీవ్ర నష్టం కలుగుతుందని రైతులు అలాంటి చర్యలకు పాల్పడవద్దని నెక్కొండ ఎస్ఐ మహేందర్ సూచించారు. పంట అవశేషాలు కాల్చడం వలన సారశక్తి తగ్గిపోవడంతో పాటు గాలి కాలుష్యం పెరిగి ప్రజల ఆరోగ్యంపై ప్రతికూల ప్రభావం పడుతుందని తెలిపారు. పంట అవశేషాలను కాల్చడం చట్టరీత్యా నేరమని, ఇలా చేసే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రైతులు పంట అవశేషాలను కంపోస్ట్ తయారీ, బయోగ్యాస్ ఉత్పత్తి, పశువుల మేత, మల్చింగ్, పుట్టగొడుగుల సాగు వంటి ఉపయోగాలకు వినియోగించాలని సూచించారు. గ్రామాల్లో టమ్ టమ్ వేయడం ద్వారా ప్రజలకు విస్తృత అవగాహన కల్పించాలని సంబంధిత సిబ్బందికి సూచించినట్లు తెలిపారు. రైతులు పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములు కావాలని ఎస్ఐ మహేందర్ పిలుపునిచ్చారు.

## రోగుల పట్ల వైద్యులు నిర్లక్ష్యం చేస్తే చర్యలు జడ్జి ఎం.హేమలత

**ప్రజాపక్షం/నర్సాపూర్:** రోగుల పట్ల వైద్యులు, సిబ్బంది నిర్లక్ష్యం చేస్తే చర్యలు తప్పవని జడ్జి ఎం.హేమలత హెచ్చరించారు. శనివారం నర్సాపూర్ పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రిని జడ్జి హేమలత ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలో రోగులకు కల్పిస్తున్న సౌకర్యాలు, మందుల లభ్యత, పరిశుభ్రత తదితర సదుపాయాలను పరిశీలించారు. ఆసుపత్రిలోని వార్డుల్లో చికిత్స పొందుతున్న రోగులతో మాట్లాడి వైద్యులు అందిస్తున్న సేవలను రోగులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆమె మాట్లాడుతూ, ఆసుపత్రిలోని వైద్యులు, సిబ్బంది సమయపాలన పాటిస్తూ రోగులకు మెరుగైన సేవలు అందించాలని సూచించారు. రోగుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. సిబ్బంది ఎప్పటికప్పుడు ఆసుపత్రిలో పరిశుభ్రతను పాటించాలని, అత్యవసర సేవలు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో వైద్యులు ఉన్నారు.

## మంచినీటిని వృథా చేయవద్దు

మున్సిపల్ కమిషనర్ చెరుకు సాయికుమార్

**ప్రజాపక్షం/నర్సాపూర్:** ప్రస్తుత వేసవిలో మంచినీటి సమస్య తలెత్తకుండా ఉండాలంటే ప్రతి ఒక్కరు మంచినీటిని వృథా చేయవద్దని మున్సిపల్ కమిషనర్ చెరుకుసాయికుమార్ అన్నారు. శనివారం నర్సాపూర్ మున్సిపాలిటీ ఒకటవ వార్డులో మున్సిపల్ కమిషనర్ చెరుకు సాయికుమార్, కౌన్సిలర్ మీనికే నరసమ్మతో కలిసి పర్యటించారు.

ఈ సందర్భంగా వార్డులో పారిశుద్ధం, వీధిదీ పాల పనితీరు, మంచినీతటి సరఫరా ను పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ చెరుకు సాయికుమార్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ మంచినీటిని వృథా చేయకుండా పొదుపుగా వాడుకోవాలని అన్నారు. నల్లాలకు తప్పనిసరిగా ఆన్ ఆఫ్ బిగించుకోవాలని అన్నారు. అయితే ఉపయోగంలో లేని నల్లాలు గుర్తించి వాటికి ఆన్‌ఆఫ్‌లు, లీకేజీలను గుర్తించి వాటికి డమ్మీ వేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో వర్క్ ఇన్స్పెక్టర్ వినీత్, మున్సిపల్ సిబ్బంది ఉన్నారు.

## కొనుగోలు కేంద్రాలను సందర్శించిన తహసీల్దార్

**ప్రజాపక్షం/పెద్ద శంకరంపేట :** మండల కేంద్రంలోని ఇందిరా క్రాంతి పథకం ద్వారాఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను తహసిల్దార్ ప్రభుదాస్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. శనివారం కమలాపూర్, జూకల్, బూరుగుపల్లి, కొత్తపేట కొనుగోలు కేంద్రాలను తహసిల్దార్ పరిశీలించారు. ఈ సందర్బంగా ఆయన కొనుగోలు కేంద్రాలలో గన్ని బ్యాగులు, హమాలీల కొరత లేకుండా చూసుకోవాలని సూచించారు. ఇందులో భాగంగా సప్తగిరి, శ్రీనివాస్, రైస్ మిల్లులో ధాన్యాన్ని లారీల నుండి వెంటనే దిగుమతి చేస్తున్నారా లేదా అని పరిశీలించారు. అనంతరం రైస్ మిల్లు హమాలీల కొరత లేకుండా చూసుకోవాలని యజమానులకు పలు సూచనలు చేశారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ధాన్యాన్ని సేకరించాలని ఆదేశించారు. రైస్ మిల్లర్సు భాద్యతయుతంగా పని చేయాలన్నారు.

## యువతకు అండగా బిఆర్ఎస్...మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి




**ప్రజాపక్షం/రామాయంపేట:** యువతకు బిఆర్ఎస్ పార్టీ అండగా ఉంటుందని మెదక్ మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి అన్నారు. శనివారం మండలంలోని అక్కన్నపేట గ్రామానికి చెందిన యువకులు పద్మాదేవేందర్‌రెడ్డి సమక్షంలో బిఆర్ఎస్‌లో చేరగా వారికి పార్టీ కండువా వేసి ఆహ్వానించారు. ఈసందర్బంగా ఆమె మాట్లాడుతూ మెదక్ జిల్లా రాజకీయాల్లో రోజురోజుకు బిఆర్ఎస్ పార్టీకి ఆదరణ పెరుగుతుందన్నారు. రాష్ట్ర అభివృద్ధి, రైతు సంక్షేమం, యువతకు ఉపాది అవకాశాల కల్పనలో బిఆర్ఎస్ ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమాల పట్ల ఆకర్శితులై యువత స్వచ్ఛందంగా పార్టీలో చేరుతున్నారని పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో బిఆర్ఎస్ పార్టీపై విశ్వాసం మరింత పెరుగుతుందన్నారు. తెలంగాణ రాష్ట్ర అభివృద్ధికి మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ తీసుకున్న నిర్ణయాలు దేశవ్యాప్తంగా గుర్తింపు తెచ్చాయన్నారు. రైతు బందు, రైతుభీమా, కళ్యాణలక్ష్మి, షాదీముభారక్, ఉచిత విద్యుత్ వంటి పథకాలు పేద ప్రజలకు ఎంతో మేలు చేశాయని గుర్తు చేశారు. కాంగ్రేస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందన్నారు. ప్రజల ఆశలు, ఆకాంక్షలు నెరవేర్చగలిగేది బిఆర్ఎస్ మాత్రమేనని అన్నారు. రాబోయు రోజుల్లో యువత పార్టీకి బలంగా నిలువాలని, గ్రామ స్థాయిలో పార్టీ బలోపేతానికి కృషి చేయాలని సూచించారు. ఈకార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మెన్ పల్లె జితెందర్‌గౌడ్, ఫ్యాక్స్ చైర్మెన్ బాదె చంద్రం, రామాయంపేట మండల పార్టీ బాద్యులు ఉమామహేశ్వర్, నరేందర్‌రెడ్డి, తాటిపల్లి రాంకీ, దొమ్మాట శ్రావణ్‌గౌడ్, వెల్ముల మహేశ్, బోద శ్రీకాంత్, పాపయ్యగారి నర్సింలు, ఎల్లగారి రాజు, నాగరాజు, వంశీ సాగర్, పవన్ సాగర్, రాఘవేంద్ర, ప్రశాంత్ సాగర్, స్వామి, సిద్దరాములుతో పాటు పాల్గొన్నారు.

## బహుజనుల బహిరంగ సభను విజయవంతం చేయండి



**ప్రజాపక్షం/బెజ్జంకి :** సామాజిక న్యాయం రాజ్యాధికారం సాధనే ధ్యేయంగా ఎవరి కులం ఎంతో వారికంత వాటా అనే నినాదంతో బిసి, ఎస్సీ, ఎస్టీ జేఏసి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించనున్న బహుజనుల బహిరంగ సభను జయప్రదం చేయాలని జేఏసి జిల్లా నాయకులు బోయిని సదన్ మహరాజ్ అన్నారు.శనివారం మండల కేంద్రంలో ని స్థానిక అంబేద్కర్ విగ్రహం వద్ద మహ సభల కరపత్రాలను బీసీ,ఎస్సీ,ఎస్టీ జేఏసి నాయకులు ఆవిష్కరించారు.ఈ సంధర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణలో ఎవరి కులం ఎంతో వారి జనాభ లెక్కల ప్రకారం అన్ని రంగాల్లో సమాన హక్కులు దక్కాలని డిమాండ్ చేస్తూ జూన్ 5న సిద్దిపేట జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలుర పాఠశాలలో (సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ ప్రాంగణంలో) భహిరంగ సభను నిర్వహిస్తున్నట్లు తెలిపారు.ఈ సభకు ముఖ్య అథితి గా బీసీ,ఎస్సీ,ఎస్టీ జేఏసి రాష్ట్ర చైర్మెన్ విశారదన్ మహరాజ్ హజరుకానున్నట్లు తెలిపారు.ఈ సమవేశానికి బహుజనులు,ప్రజాస్వామ్యవాదులు అధిక సంఖ్యలో హజరై విజయవంతం చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో జేఏసి మండల నాయకులు మాంకాళి సురేష్, కట్ల అంజిబాబు, సర్పంచ్ బొల్లం శ్రీధర్, ఉప సర్పంచ్ దూమాల మహేష్, అంబేద్కర్ ఉత్సవ కమిటీ చైర్మెన్ ఐలేని శ్రీనివాస్ రెడ్డి, స్వేరో నాయకులు బొర్ర సురేష్ కుమార్, సిపిఎం నాయకులు బోనగిరి లింగయ్య, చిట్యాల శంకర్, మక్సుద్, కల్లూరి రవీందర్, రాజు, చిరంజీవి, అంజి, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా పెద్దమ్మతల్లి వార్షికోత్సవ వేడుకలు

హాజరైన ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌రావు



**ప్రజాపక్షం/రామాయంపేట:** మండలంలోని అక్కన్నపేట గ్రామంలో శ్రీపెద్దమ్మ తల్లి అమ్మవారి 17వ వార్శికోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. వేదపండితుల మంత్రోచ్చరణాల మద్య అత్యంత వైభవంగా ఆద్యాత్మిక వాతావరణంలో జరిగాయి. గత నాలుగు రోజులుగా జరుగుతన్న ఉత్సవాల్లో బాగంగా శనివారం మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌రావు ముఖ్యఅథితిగా హాజరై అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయనకు కాంగ్రేస్ పార్టీ నాయకులు నమూండ్ల సందీప్ అద్వర్యంలో ఘనంగా స్వాగతం పలికారు. ఎమ్మెల్యేకు వేదపండితులు ఆశీర్వచనలు అందించి తీర్థప్రసాదాలు అందజేశారు. అనంతరం ముదిరాజ్ సంఘం అద్వర్యంలో ఎమ్మెల్యే రోహిత్‌రావుకు శాలువా కప్పి పూలమాలలతో ఘనంగా సన్మానించారు. గ్రామాభివృద్ధికి, ముదిరాజ్ సంఘం పటిష్టతకు అండగా ఉంటానని ఈసందర్బంగా ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. అమ్మవారి వార్శికోత్సవాన్ని పురస్కరించుకొని అక్కన్నపేటలో పండుగ వాతావరణం నెలకొంది. ముదిరాజ్ సంఘం అద్వర్యంలో వచ్చిన భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా అన్ని రకాల ఏర్పాట్లు చేశారు. ఈకార్యక్రమంలో రామాయంపేట మున్సిపల్ కౌన్సిలర్లు గజవాడ నాగరాజు, దేవుని రంజిత్, కాంగ్రేస్ పార్టీ నాయకులు పోచమ్మల గణేష్, చింతల స్వామి, తొంటవాలి యాదగిరితో పాటు గ్రామస్థులు బాసం విజయ్, ప్రభాకర్‌తో పాటు పాల్గొన్నారు.

## చికిత్స పొందుతూ యువకుడు మృతి

**ప్రజాపక్షం/శివ్వంపేట :** ఆత్మహత్యకు పాల్పడి చికిత్స పొందుతూ యువకుడు మృతిచెందిన ఘటన శివ్వంపేట పోలీస్‌స్టేషన్ పరిధిలోని కొంతాన్‌పల్లి గ్రామంలో చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం కొంతాన్‌పల్లి గ్రామానికి చెందిన కొలకంటి శివయ్యకు ఇద్దరు కుమారులు, ఒక కూతురు ఉండగా కూతురు వివాహం జరిగింది. శివయ్య చిన్నకుమారుడు నరేందర్ (26) పనిబాట చేయడం లేదని ఏదైనా పనిచేసుకోవాలని ఈ నెల 22న తండ్రి మందలించాడు. దీంతో మనస్థాపానికి గురైన నరేందర్ గ్రామశివారులోని పర్వతనేని నర్సింగరావు మామిడితోటలో గుర్తుతెలియని పురుగుల మందు తాగి కనిపించడంతో వెంటనే కుటుంబీకులు తూప్రాన్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

అక్కడి నుంచి మేడ్చల్ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ శనివారం ఉదయం తెల్లవారుజామున 3గంటలకు మృతిచెందాడు. ఈ విషయమై తండ్రి శివయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై మధుకర్‌రెడ్డి తెలిపారు.

## ప్రభుత్వ సలహాదారుడు, మాజీ ఎంపిని సన్మానించిన సిద్దిపేట కాంగ్రెస్ నేత శ్రీనివాస్

**ప్రజాపక్షం/సిద్దిపేట:** సీనియర్ కాంగ్రెస్ నేత, మాజీ ఎంపి వి,హన్మంత్‌రావు సిద్దిపేట జిల్లా కేంద్రంలో రేణుక మాత ఆలయాన్ని సందర్శించి ప్రత్యేక పూజలు చేశారు. సిద్దిపేట పట్టణ మాజీ కాంగ్రెస్ అధ్యక్షుడు గుండ్రేటి శ్రీనివాస్ ఇటివల ప్రభుత్వ సలహదారునిగా నియామకం అయిన వి.హన్మంత్‌రావు ను మర్యాద పూర్వకంగా కలసి శాలువాతో సన్మానించారు. ఈసందర్భంగా సిద్దిపేట నియోజక వర్గం కాంగ్రెస్ పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఆనంతరం హన్మంత్‌రావు మాట్లాడుతూ రాబోవు మున్సిపల్ ఎన్నికల్లో సిద్దిపేటలోకాంగ్రెస్ జెండా ఎగురవేయాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ పథకాలను విస్తృతంగా ప్రచారం చేయాలన్నారు.అలాగే ఎంపిటిసి, జడ్పిటిసి ఎన్నికల్లో సిద్దిపేట జిల్లా పరిషత్‌పై కాంగ్రెస్ కైవసం చేసుకునేందుకు కార్యకర్తలు అహర్నిశలు కృషిచేయాలన్నారు. పార్టీలో పనిచేసే కార్యకర్తలకు తగిన గుర్తింపు పార్టీ అధిష్టానం కల్పిస్తుందన్నారు.

## హనుమాన్ ఆలయాల్లో ప్రత్యేక పూజలు

**ప్రజాపక్షం/కౌడిపల్లి :** కౌడిపల్లి మండల పరిధిలో శనివారం హనుమాన్ ఆలయాలు భక్తులతో కిక్కిరిశాయి. వెల్మకన్న గ్రామంలోని బాలవీర హనుమాన్ ఆలయంలో పూజారి మెట్టు రాములు శర్మ ఆధ్వర్యంలో ఉదయం పంచామృత అభిషేకం, చందన అలంకరణ, విశేష పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ముప్పిడి శ్రీనివాస్ గౌడ్ కుటుంబ సభ్యులు, లండన్‌కి చెందిన ఎన్నారై భక్తులు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పూజారి మెట్టు రాములు శర్మ మాట్లాడుతూ, భగవత్ కార్యాలలో పాల్గొనడం ద్వారా మనసుకు ప్రశాంతత కలుగుతుందని, ప్రతి ఒక్కరూ ఇలాంటి సేవా కార్యక్రమాల్లో భాగస్వాములు కావాలని సూచించారు. భగవంతుని ఆశీస్సులతో ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమాల్లో ఆయా గ్రామాల పెద్దలు, భక్తులు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## బాలల ఆరోగ్య పరిరక్షణలో అంగన్‌వాడీ, ఆశ వర్కర్ల పాత్ర ఎంతో కీలకం

**ప్రజాపక్షం/నర్సాపూర్ :** బాలల ఆరోగ్య పరిరక్షణలో అంగన్వాడి ఆశ వర్కర్ల పాత్ర ఎంతో కీలకమని నర్సాపూర్ మున్సిపల్ చైర్మన్ లక్ష్మి రాజు యాదవ్ అన్నారు. శనివారం నర్సాపూర్ పట్టణంలోని అంగన్వాడి కేంద్రంలో ప్రజా పాలన, 99 రోజుల ప్రగతి ప్రణాళికలో భాగంగా బాలల సంరక్షణ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా చైర్మన్ లక్ష్మి రాజు యాదవ్ హాజరై మాట్లాడుతూ, ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని అంగన్వాడి టీచర్లు, ఆశ వర్కర్లు ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. చిన్నారుల ఆరోగ్యం, పోషకాహారం, విద్య భద్రతపై వారి తల్లిదండ్రులకు పలు సూచనలు సలహాలు చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ సాయికుమార్, వైద్య సిబ్బంది, అంగన్వాడి టీచర్లు, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

## వెల్దుర్తి మండల బిజెపి కన్వీనర్‌గా బాల గౌడ్

**ప్రజాపక్షం/వెల్దుర్తి:** మెదక్ జిల్లా వెల్దుర్తి మండలం భారతీయ జనతా పార్టీ కన్వీనర్ గా హనుమాద్రి బారా గౌడ్ ను నియమిస్తూ మెదక్ జిల్లా బిజెపి అధ్యక్షులు మల్లేష్ గౌడ్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా బాలా గౌడ్ మాట్లాడుతూ, భారతీయ జనతా పార్టీ నాపై నమ్మకం ఉంచి నన్ను కన్వీనర్ గా నియమించినందుకు జిల్లా అధ్యక్షులు మల్లేష్ గౌడ్ కు వెల్దుర్తి సర్పంచ్ ఆదర్శ్ జిల్లా బిజెపి నాయకులు శ్రీనివాస్ గౌడ్ లకు కృతజ్ఞతలు తెలిపారు. భారతీయ జనతా పార్టీ మండల వ్యాప్తంగా విస్తరించి పార్టీ కోసం పని చేస్తానని ఆయన తెలిపారు.

## అందుబాటులో జీలుగ విత్తనాలు

**ప్రజాపక్షం/శివ్వంపేట :** శివ్వంపేట మండలంలో రైతుల కోసం జీలుగ విత్తనాలు అందుబాటులో ఉన్నాయని మండల వ్యవసాయాధికారిని లావణ్య ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 30కిలోల జిలుగు బస్తా రూ. 2452, ఒక బస్తా రెండున్నర ఎకరాలకు సరిపోతుందని, అవసరమైన రైతులు సోమవారం వ్యవసాయశాఖ కార్యాలయానికి వచ్చి ఆధార్‌కార్డు, పట్టాపాసుబుక్‌తో వచ్చి విత్తనాలను కొనుగోలు చేయాలని తెలిపారు.

## పారిశుద్ధ్య కార్మికుడి కుటుంబానికి ఆర్థికసాయం



**ప్రజాపక్షం/ములుగు:** ములుగు జిల్లా కేంద్రంలోని మున్సిపాలిటీ సిబ్బందిగా పనిచేస్తూ పారిశుధ్య కార్మికులు బోడ సాంబయ్య ఇటీవల వడదెబ్బతో మృతి చెందగా శనివారం బాధిత కుటుంబాన్ని మాజీ జడ్పి చైర్‌పర్సన్, బిఆర్ఎస్ పార్టీ ములుగు నియోజకవర్గ ఇన్‌చార్జి బడే నాగజ్యోతి సందర్శించి వారి కుటుంబానికి తన ప్రగాఢ సానుభూతి తెలిపి రూ.10వేల ఆర్థికసాయం అందజేశారు. వారి కుటుంబానికి అండగా ఉంటానని భరోసా కల్పించారు. వడదెబ్బతో మృతిచెందిన బోడ సాంబయ్య కుటుంబానికి రాష్ట్ర ప్రభుత్వం వెంటనే రూ.4లక్షల ఎక్స్‌గ్రేషియా అందించాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ జిల్లా నాయకులు వేములపల్లి బిక్షపతి, ములుగు మండల పార్టీ మాజీ అధ్యక్షులు సానికొమ్ము రమేష్ రెడ్డి, ఆకుతోట చంద్రమొగిలి, కోళ్ళ వెంకన్న, ములుగు మున్సిపాలిటీ కౌన్సిలర్లు బైకని సాగర్, బైకని ఓదెలు, మాజీ సర్పంచ్‌లు గండి కుమార్, ఈసం రాంమూర్తి, కాకి పురుషోత్తం, మాజీ ఎంపిటిసి అనుముల సురేష్, పోరిక శ్యామల నాయక్, వెంకట రెడ్డి, స్థానిక నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

## భూముల మార్కెట్ విలువల సవరణ ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేయాలి

**ప్రజాపక్షం/ములుగు:** భూముల మార్కెట్ విలువల సవరణ ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేయాలని భూ పరిపాలన ప్రధాన కమిషనర్ డిఎస్ లోకేష్ కుమార్ తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా భూముల మార్కెట్ విలువల సవరణ ప్రక్రియను వేగవంతం చేయడంపై శనివారం హైదరాబాద్ నుండి భూ పరిపాలన ప్రధాన కమిషనర్ డిఎస్ లోకేష్ కుమార్, ఐఏఎస్ అన్ని జిల్లాల కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు రెవెన్యూలతో ఉన్నత స్థాయి వీడియో కాన్ఫరెన్స్ సమావేశాన్ని నిర్వహించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ సమావేశానికి ములుగు జిల్లా కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుండి జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు, అదనపు కలెక్టర్ రెవెన్యూ సిహెచ్ మహేందర్ జితో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా భూ పరిపాలన ప్రధాన కమిషనర్ డిఎస్ లోకేష్ కుమార్ మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రస్తుతం ఉన్న మార్కెట్ డిమాండ్, వాస్తవ పరిస్థితులకు అనుగుణంగా మే 28 నాటికి మార్కెట్ విలువల సవరణ పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. క్షేత్రస్థాయిలో ఉన్న వాస్తవ మార్కెట్ ధరలను నిశితంగా పరిశీలించి, ఎలాంటి వ్యత్యాసాలు లేకుండా శాస్త్రీయంగా ఈ విలువలను ఖరారు చేయాలని సూచించారు. రెవెన్యూ రిజిస్ట్రేషణ్ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి నిర్ధేశిత గడువులోగా నివేదికలను సిద్ధం చేయాలని ఆదేశించారు. ములుగు జిల్లాలో భూముల మార్కెట్ విలువల సవరణ ప్రక్రియను అత్యంత పారదర్శకంగా, గడువులోగా పూర్తి చేస్తామని కలెక్టర్ తెలిపారు. ప్రస్తుతం మార్కెట్‌లో ఉన్న డిమాండ్‌ను బట్టి ఎక్కడా ప్రజలకు ఇబ్బంది కల్గకుండా అదే సమయంలో ప్రభుత్వ నిబంధనలకు లోబడి ఈ సవరణలు ఉంటాయని పేర్కొన్నారు. ఈ సమావేశంలో డిప్యూటీ తహసీల్దారు చంద్రశేఖర్, సంబంధిత అధికారులు, పాల్గొన్నారు.

# షెడ్యూల్ ఏరియాలో అక్రమ కట్టడాలను తొలగించాలి

**ప్రజాపక్షం/మంగపేట:** ములుగు జిల్లా షెడ్యూల్ ఏరియా ఏజెన్సీ ప్రాంతం మంగపేట మండలం కమలాపురం గ్రామం ఆర్ఎంసి పాఠశాల ముందు ప్రభుత్వ భూమి సర్వే నంబర్ 116 గల కవ్వాలకుంట చెరువు కబ్జాకి గురైంది. మండల కేంద్రం లోని ప్రభుత్వ భూమి సర్వేనెంబర్ 20, సర్వేనెంబర్ 107, సర్వే నెంబరు 166 లో గిరినేతరులు ఆక్రమించుకోని కార్మిక భవనం రేకుల షెడ్లు పోల్స్ నిర్మించినారు ఇట్టి అక్రమ నిర్మాణాలను తొలగించాలని శనివారం రోజున మండల తాహసిల్దార్ తోట రవీందర్ ను కలిసి మెమోరాండం ఇవ్వడం జరిగింది. మన్యసీమ పరిరక్షణ సమితి డోలు దెబ్బ మంగపేట మాట్లాడుతూ షెడ్యూల్ ఏరియా ల్యాండ్ ట్రాన్స్ఫర్ రెగ్యులేషన్ 1/59, సవరణ రెగ్యులేషన్ 1/70, చట్టం సెక్షన్ 3 (1) ప్రకారం గిరిజన ప్రాంతంలో గిరిజనేతరలకు భూములపై ప్రభుత్వ భూములపై కానీ భూముల మార్పిడి పై కానీ ఎలాంటి చట్టం రైట్స్ లేదు గిరిజన ప్రాంతంలో గిరిజనేతరులు నిషేధించబడినారు గిరిజన ప్రాంతంలో గిరిజన చట్టాలకు విరుద్ధంగా మంగపేట మండల కేంద్రం లో ప్రభుత్వ భూమి సర్వే నెంబర్ 20, లో చల్ల రమణయ్య అక్రమంగా ఆక్ర



మించుకొని కార్మిక భవనం నిర్మించారు. ఈ అక్రమ నిర్మాణాలను తొలగించాలని కోరుతూ 1359 పస్లి ప్ర కారం గిరిజన ప్రాంతంలో ప్రాంతంలో గిరిజన చట్టాల ప్రకారం అన్ని రకాల భూములు రక్షింపబడాలి అవి మా ఆదివాసి గి రిజనులకే ఇవ్వాలని కోరుతూ షెడ్యూల్ ఏరియా ఏజెన్సీ ప్రాంతంలో గిరిజన చట్టాలు 1/59, 1/70, ఎల్టిఆర్, పెసా చట్టాలు గిరిజన చట్టాలు అమలు చేయాలని మెమోరాండం ద్వారా కోరుతున్నాం. ఈ కార్యక్రమంలో మన్య సీమ మంగపేట మండల అధ్యక్షుడు తాటి నాగరాజు, మన్య సీమ జిల్లా నాయకులు ఆక తిరుమలరావు, గొప్ప చంద్రకాంత్, తోలేం సుధాకర్ పెద్దల పాల్గొన్నారు.

# అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకం అందాలి

### కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ చెట్టిపల్లి వెంకటేశ్వర్లు

**ప్రజాపక్షం/మంగపేట:** తెలంగాణ రాష్ట్ర ప్రజా ప్రభుత్వం అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రభుత్వ పథకం అందాలని కాంగ్రెస్ పార్టీ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ చెట్టుపెల్లి వెంకటేశ్వర్లు అన్నారు. శనివారం మీడియా సమావేశంలో వెంకటేశ్వర్లు మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఏనుముల రేవంత్ రెడ్డి పంచాయతీ రాజ్ శాఖ మంత్రి దణసరి అనసూయ సీతక్క సమాన్వయంతో కొత్తగా రెండు లక్షల ఆసరా పెన్షన్లను అర్హులైన ప్రజలకు అందె విధంగా జూన్ 2 న తెలంగాణ అవతరణ దినోత్సవం రోజున ప్రారంభించనున్నారు. మంగపేట ప్రజలందరూ గతంలో ప్రజా పాలనలో దరఖాస్తు చేసుకోని వారు తమకు సంబంధించిన గ్రామ పంచాయతీలో ఆసరా పెన్షన్ల గురించి పంచాయతీ కార్యదర్శి దగ్గర దరఖాస్తు చేసుకోవాలని, ఆసరా పెన్షన్ లో వృద్యాప్య పింఛను వితంతు మహిళా వికలాంగులు (దివ్యంగులు) ఒంటరి మహిళలు దీర్ఘాలిక వ్యాధులు గల లబ్ధిదారులు అందరు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని, తెలంగాణ ప్రజా ప్రభుత్వం అర్హులైన అందరికి ప్రభుత్వ పథకం అందివ్వడానికి ఉంది అని కాంగ్రెస్ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ చెట్టిపల్లి వెంకటేశ్వర్లు కోరారు.

# జనగణన పకడ్బందీగా నిర్వహించాలి

### కలెక్టర్ రాహుల్ శర్మ

**ప్రజాపక్షం/భూపాలపల్లి :**జనగణన సర్వేలో భాగంగా జరుగుతున్న ఇండ్ల గణనను పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ తెలిపారు. శనివారం జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ ఐడిఓసీ కార్యాలయం నుండి ఆర్డీఓలు, తహసిల్దార్లు, ఎంపీడీవోలతో జనగణన, బల్క్ ల్యాండ్ ఇష్యూస్, సాదా బైనామా, భూభారతి, ధాన్యం కొనుగోలు తదితర అంశాలపై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ మాట్లాడుతూ, ఒకే చోట ఉండి సర్వే చేయడం కాకుండా కచ్చిత సమాచారం సేకరణకు ప్రతి ఇల్లు క్షుణ్ణంగా సర్వే చేయాలని ఆదేశించారు. 33 కాలాలతో కూడిన సర్వేలో కొన్ని చోట్ల తప్పులు దొర్లితే ఎన్యూమరేటర్లు, సూపర్ వైజర్లు లాగిన్ ఓపెన్ చేసి డాటా ను ఫోటోలు తీసుకుని తిరిగి తప్పులు లేకుండా ఎంట్రీ చేయాలని తెలిపారు. జిల్లాలో బల్క్ ల్యాండ్ సమస్యలను వెంటనే పరిష్కరించేందుకు చర్యలు




చేపట్టాలని రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి జిల్లాల పర్యటన సందర్భంగా పరిష్కరించిన భూములకు అర్హులైన లబ్ధిదారులకు పట్టాలు అందచేస్తారని తెలిపారు. సాదా బైనమా, తహసిల్దార్లు దృష్టి సారించాలని కొనుగోలు కేంద్రాలను పరిశీలించి ధాన్యాన్ని వెంట వెంటనే మిల్లులకు తరలించేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద లారీల కొరత లేకుండా తహసిల్దార్లు పర్యావరణ చేయాలని ఆదేశించారు. ఎంఈ వీడియో కాన్ఫరెన్స్ లో అదనపు కలెక్టర్ అశోక్ కుమార్, భూపాలపల్లి, కాటారం ఆర్డిఓ లు, అన్ని మండలాల తహసీల్దార్లు తదితరులు పాల్గొన్నారు.

# జాబ్ మేళాను సద్వినియోగం చేసుకుని ఉపాధి పొందాలి

### కలెక్టర్ రాహుల్ శర్మ

**ప్రజాపక్షం/భూపాలపల్లి :**నిరుద్యోగ యువతీ యువకులు జాబ్ మేళాలను సద్వినియోగపరుచుకొని ఉద్యోగ ఉపాధి అవకాశాలు పొందాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ ఆకాంక్షించారు. శనివారం ఐడిఓసి కార్యాలయ సమావేశపు హాలులో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా నిర్వహించిన మెa గా జాబ్ మేళాలో ఉద్యోగాలు సాధించిన యువతీ యువకులకు జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ ఉద్యోగ నియామక పత్రాలు అందజేశారు. అనంతరం ప్రజా పాలన ప్రతి ప్రణాళికలో భాగంగా నిర్వహించిన క్రీడా పోటీలలో ప్రతిభ కనబరిచిన పాఠశాలల విద్యార్థిని, విద్యార్థులకు మెమొంటోలను బహుకరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా నుండి జాబ్ మేళా ద్వారా 43 మంది యువతీ, యువకులకు ఉద్యోగ అవకాశాలు లభించాలని ఆయన పేర్కొన్నారు. క్రీడాకారులలో ఉన్న



నైపుణ్యాన్ని వెలికి తీసేందుకు సీఎం కప్ క్రీడా పోటీలు ఎంతో ఉపయోగపడుతున్నాయని తెలిపారు. సీఎం కప్ క్రీడా పోటీలలో విద్యార్థులు ప్రతిభ కనబరచడం చాలా సంతోషమని అన్నారు. నేటి విద్యార్థులు రేపటి క్రీడాకారులుగా ఎదగాలని తద్వారా మన జిల్లాకు, రాష్ట్రానికి క్రీడల్లో మంచి పేరు ప్రఖ్యాతులు తీసుకురావాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో జిల్లా యువజన, క్రీడల శాఖ అధికారి రఘు, సిబ్బంది సాగర్, యువతీ యువకులు, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

## గుర్తించిన ఘాట్ల వద్దనే భక్తులు పుష్కర స్నానాలు ఆచరించాలి

**ప్రజాపక్షం/భూపాలపల్లి/కాళేశ్వరం:** కాళేశ్వరం క్షేత్రంలో కొనసాగుతున్న సరస్వతి అంత్య పుష్కరాల సందర్భంగా పుష్కర ఘాట్ల వద్దకు భారీగా తరలివస్తున్న భక్తులు అధికారులు గుర్తించిన ఘాట్ల వద్దనే తప్పనిసరిగా పవిత్ర స్నానాలు ఆచరించాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ సూచించారు. అనధికారికంగా గుర్తించని ఇతర ప్రాంతాల్లో స్నానాలు చేయడం ప్రమాదకరమని ఆయన హెచ్చరించారు. నదిలో ప్రవాహం,లోతు వంటి అంశాలు పరిగణనలోకి తీసుకుని అధికారులు భద్రతా చర్యలు చేపట్టిన పుష్కర ఘాట్లను మాత్రమే వినియోగించాలని భక్తులకు విజ్ఞప్తి చేశారు. భక్తుల ప్రాణ భద్రత దృష్ట్యా జిల్లా యంత్రాంగం సూచనలు, సలహాలు తప్పనిసరిగా పాటించాల్సిందిగా ఆయన కోరారు. ఇప్పటికే ఘాట్ల వద్ద రక్షణ సిబ్బంది,గజ ఈతగాళ్లు, వైద్య సిబ్బంది మరియు అవసరమైన ఏర్పాట్లు చేయబడ్డాయని తెలిపారు. ఎలాంటి అప్రమత్తత లేకుండా ఇతర ప్రాంతాల్లో స్నానాలు చేయడం వల్ల ప్రమాదాలు సంభవించే అవకాశం ఉందని ఆయన హెచ్చరించారు. అందువల్ల భక్తులు క్రమశిక్షణతో వ్యవహరించి,అధికారుల మార్గదర్శకాలను పాటిస్తూ సురక్షితంగా పుష్కర స్నానాలు ఆచరించాలని జిల్లా కలెక్టర్ పిలుపునిచ్చారు.

## ఉపాధిహామీ కూలీలకు మజ్జిగ, ఓఆర్ఎస్ ప్యాకెట్లు పంపిణీ



**ప్రజాపక్షం/తాడ్వాయి:**మంత్రి సీతక్క ఆదేశాల మేరకు జిల్లా అధ్యక్షులు పైడాకుల అశోక్ సూచనల మేరకు తాడ్వాయి మండలంలోని పంబాపూర్ గ్రామ పంచాయతీ పరిధిలో కొనసాగుతున్న మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పనులు సర్పంచ్ ముక్తి శ్రీనివాస్ ప్రత్యక్షంగా పరిశీలించారు. గత కొన్ని రోజులుగా మండుతున్న ఎండలు తీవ్రస్థాయిలో ఉండడంతో ఉపాధిహామీ పనులకు హాజరవుతున్న కార్మికుల ఇబ్బంది దృష్ట్యా వారి ఆరోగ్యం రీత్యా మజ్జిగ, పెరుగు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు శీతల పానియాలు పంపిణీ చేశారు. డి హైడ్రేషన్ సమస్యలు తలెత్తకుండా ఉండేందుకు ఇవి ఎంతో అవసరమని కార్మికులకు అవగాహన కల్పించారు. అలాగే పనిచేసే ప్రదేశంలో చల్లని త్రాగునీరు సదుపాయం ఏర్పాటు చేశారు. గ్రామ అభివృద్ధిలో ఉపాధిహామీ కార్మికుల పాత్ర ఎంతో ముఖ్యమని కార్మికులు భద్రతే మా బాధ్యత అని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ పోలేబోయిన సమ్మక్క, లక్ష్మీనారాయణ, పంచాయతీ సెక్రటరీ భాస్కర్, మాజీ సర్పంచ్ కల్తీ నారాయణ, నాగేశ్వరరావు, వెంకటేష్, రాజేందర కృష్ణ, ముక్తి రామారావు, రమేష్, పాల్గొన్నారు.

## ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో యువతకు ఉపాధి బాట

**ప్రజాపక్షం/ములుగు:**ప్రజాపాలన..ప్రగతి ప్రణాళికలో భాగంగా ములుగు జిల్లాకు చెందిన 25 మంది యువతీ యువకులకు జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు ఉద్యోగ నియామక పత్రాలను అందజేశారు. 99 రోజుల ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా, యువజన, క్రీడా వారోత్సవాలను పురస్కరించుకొని 6వ రోజున జిల్లా యువజన క్రీడల శాఖ ఆధ్వర్యంలో ములుగు టాస్క్ సెంటర్‌లో ఉద్యోగ సాధన, ప్రతిభకు అవకాశాల అనుసంధానం అనే అంశంపై శనివారం ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు తన ఛాంబర్‌లో ఈ నెల 8వ తేదీన వరంగల్ వేదికగా జరిగిన మెగా జాబ్ మేళాలో వివిధ ప్రయివేట్ సంస్థలలో ఉద్యోగాలకు ఎంపికైన ములుగు జిల్లా అభ్యర్థులకు ఆర్డర్ కాపీలను అందజేసి అభినందించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ యువతలోని ప్రతిభను గుర్తించి, వారికి తగిన ఉపాధి అవకాశాలు కల్పించడం ద్వారా బంగారు భవిష్యత్తుకు బాటలు వేసే దిశగా రాష్ట్ర ప్రభుత్వం జిల్లా యంత్రాంగం నిరంతరం కృషి చేస్తున్నాయి. తగిన అర్హత, నైపుణ్యాలు కలిగిన స్థానిక యువతీ యువకులకు రాబోయే రోజుల్లో మరిన్ని మెరుగైన అవకాశాలు కల్పించడం కోసం ప్రయివేట్ లిమిటెడ్, బహుళజాతి కంపెనీల సహకారంతో త్వరలోనే జిల్లాలో మెగా జాబ్ మేళాను నిర్వహించడానికి యంత్రాంగం సిద్దంగా ఉందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా యువజన క్రీడల అధికారి బి రామ్ మోహన్, టాస్క్ మేనేజర్ మురళీకృష్ణ, ఇతర శాఖల అధికారులు, ఉద్యోగాలు సాధించిన యువత తదితరులు పాల్గొన్నారు.

